చక్రపాణి 'తీన్‌మార్ '!

ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన తల్లంపాడు యువకుడు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 29: మండలంలోని తల్లంపాడు గ్రామానికి చెందిన చక్రపాణి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. తల్లంపాడు గ్రామానికి చెందిన అంతోటి వెంకటేశ్వర్లు-కౌసల్య చిన్న కుమారుడు చక్రపాణిని ఎంఎస్సీ బీఈడీ చదివాడు. 2023లో గురుకుల పోస్టులకు పరీక్షలు రాశాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో టీజీటీ (ట్రైనింగ్ గ్రాడ్యువేట్ టీచర్), పీజీటీ (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్), జేఎల్ (జూనియర్ లెక్చరర్) ఉద్యోగాలు సాధించాడు. మూడు ఉద్యోగాల్లో తాను జేఎల్‌లో చేరనున్నట్లు చక్రపాణి తెలిపాడు.

అప్పలనర్సింహాపురం యువకుడికీ మూడు కొలువులు..

కూసుమంచి(నేలకొండపల్లి) ఫిబ్రవరి 29: నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం గ్రామానికి చెందిన కందుల సురేశ్ ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. గురువారం వెలువడిన గురుకుల ఫలితాల్లో సురేశ్ టీజీటీ, పీజీటీ, గురుకుల జేఎల్ ఉద్యోగాలు సాధించాడు. సురేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు షురూ

467మంది గైర్హాజర్, ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం పరీక్షలు ప్రారంభమైయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ సబ్జెక్ట్‌లో పరీక్ష నిర్వహించారు. జనరల్ కేటగిరీలో 14,906 మందికి 14,525 మంది హాజరు కాగా 382 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరిలో 2,101 మందికి 2,016 మంది హాజరై 85 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో రవిబాబు తెలిపారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడుతుండగా చీఫ్ సూపరింటెండెంట్ మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ తనిఖీ చేశారు.

రహదారుల వెంట కళాశాలల వద్ద పోలీసులు..

నగరంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన కేంద్రాల కంటే ఈ కళాశాలల వద్ద ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు ఇద్దరు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో కానీ, పరీక్ష ముగిసిన అనంతరం కానీ రోడ్డు మీదే నిలబడడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని డీఐఈవో, స్పెషల్ బ్రాంచ్‌ల సమన్వయంతో చర్యలు తీసుకున్నారు.

కేఎంసీ కార్యాలయంలో రెవెన్యూ మేళా

ఖమ్మం, ఫిబ్రవరి 29: ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళాను నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నుల హెచ్చు తగ్గులు, పంపు పన్ను పేరు మార్పులు చేర్పులు, రివిజన్ పిటిషన్, డోర్ నెంబర్ సవరణ వంటి వాటికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా 2022-23 వరకు బకాయి ఉన్న ఆస్తి పన్నుపై విధించిన మొత్తం వడ్డీపై 90 శాతం మాఫీ చేశామన్నారు. ఈ సదవకాశాన్ని నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

నకిలీ పత్రాలతో బ్యాంకు రుణాలు

ముగ్గురిని అరెస్టు చేసిన ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 29: వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులమని చెప్పి నకిలీ పత్రాలు సృష్టించి ఎస్‌బీఐలోని పలు బ్రాంచీల్లో రుణాలు ఇప్పించిన ముగ్గురు నిందితులను ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. వన్‌టౌన్ ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన గుగ్గిళ్ల విజయ్, నల్లగట్ల కరుణాకర్, నజీర్, ప్రశాంత్ కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులమని చెప్పి కొందరు మధ్యవర్తులను మాట్లాడుకున్నారు. వారి పేరున నకిలీ శాలరీ సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్లు, ఉద్యోగ ఐడీ కార్డులు సృష్టించారు. వీరికి అదే ఖమ్మం రూరల్ మండలానికి చెందిన కోటమర్తి దినేశ్‌కుమార్‌తోపాటు అదే మండలానికి చెందిన మరో తొమ్మిదిమంది సహకరించారు. ఈ తొమ్మిది మందికి ఖమ్మంలోని వివిధ ఎస్‌బీఐ బ్రాంచీల్లో రూ.60 లక్షలను రుణాలుగా మంజూరు చేయించారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ కమిషన్ రూపంలో నిందితులు తీసుకున్నారు. అయితే రుణాలు తీసుకున్న నాటి నుంచి రుణాలు పొందిన తొమ్మిది మంది ఈఎంఐలు చెల్లిస్తూనే ఉన్నారు. రుణాలు ఇప్పించి కమీషన్లు పొందిన వారి వాటాల పంపకంలో తేడాలు రావడంతో విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై ఫిర్యాదు స్వీకరించిన వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం రుణాలు ఇప్పించిన ముఠాలో గుగ్గిళ్ల విజయ్, నల్లగట్ల కరుణాకర్, పొందిన కోటమర్తి దినేశ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే నిందితులపై గతంలోనూ ఇదే తరహా కేసు కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ నమోదైంది. మరో ఇద్దరు నిందితులు, పొందిన వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

బ్లాస్టింగ్ సామగ్రి పట్టివేత

ముదిగొండ, ఫిబ్రవరి 29: అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కమలాపురం గ్రామ శివారులో బ్లాస్టింగ్ సామగ్రిని అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఓ ట్రాక్టర్, 10 డిటోనేటర్లు, 80 జిలిటెన్ స్టిక్స్, మేకర్ బాక్స్, వైర్ బండిల్ సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. కొమ్మరాజుల అనీల్, ముద్దనాగుల తిరపతిరావును అదుపులోకి తీసుకోగా వెంకటేష్ పరారీలో ఉన్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మం, ఫిబ్రవరి 29: టీఎన్‌జీవో ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఫోరం-2024 క్యాలండర్‌ను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా కార్యాలయంలోని విద్యాశాఖ విభాగంలో డీఈవో సోమశేఖరశర్మతో కలిసి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్వీఎస్ సాగర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూసఫ్, నగేశ్, శ్రీను, ప్రసాద్, వీరనారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామి

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

దేవాదాయ శాఖ సమీక్షలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 29: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో నూతన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రామలింగేశ్వరస్వామి దేవాలయం 5.28 ఎకరాల్లో విస్తరించి ఉందని అన్నారు. ప్రధాన ఆలయం, కమ్యూనిటీ హాల్, రెండు చిన్న దేవాలయాలు, బ్రిడ్జి, పల్లె ప్రకృతి వనం, వేస్టేజ్ షెడ్లు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం కాంపౌండ్ వాల్, అభిషేక మండపం, వేదిక, డార్మిటరీలు, స్నానాల గదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పార్క్ ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. నేచురల్ షెడ్లు, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం బెంచీలు, హైమాస్ట్ లైట్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవాలయ అప్రోచ్ రోడ్డును అభివృద్ధి పరచాలన్నారు. పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, శివరాత్రిలోపు తీర్థాల దేవాలయ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అధికారులు శ్రీనివాస్, సులోచన, దుర్గాప్రసాద్, రమణ, గణేశన్, హరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి'

జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ధరణి నూతన మార్గదర్శకాలపై ఆ శాఖ అధికారులతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నూతన మార్గదర్శకాలపై అధికారులు పూర్తి అవగాహన పొందాలన్నారు. బృందాలు ఏర్పాటు చేసి దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, శిక్షణ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, వివిధ శాఖల అధికారులు విజయనిర్మల, హరికిషన్, సత్యనారాయణ, నాగలక్ష్మి, అరుణ, మీనన్, మదన్ గోపాల్, సత్యనారాయణ, రాంబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి: ఏసీ

జిల్లాలో వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డీ.మధుసూదన్‌నాయక్ అధికారులకు సూచించారు. పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారం, పురోగతి అంశాలపై ఆయా శాఖల అధికారులతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల్లో టైం బాండ్ కేసులు, డైరెక్షన్లు, ధిక్కార, రిట్ పిటిషన్లు ఉన్నట్లు తెలిపారు. వీటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు హరికిషన్, సోమశేఖరశర్మ, ఆంజనేయ స్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ ఫైనల్స్‌కు బాలాజీ బ్లాస్టర్స్ జట్టు

విజేతలను అభినందిస్తున్న ప్రముఖులు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 29: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. గురువారం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ బాలాజీ బ్లాస్టర్స్, జేవీడీ చిటాస్ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిటాస్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బాలాజీ బ్లాస్టర్స్ జట్టు 10.5 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 83 పరుగులు సాధించి ఫైనల్స్‌కు చేరింది. ముఖ్య అతిథిగా మహారాష్ట్ర టీ 20 చైర్మన్ సుభాశ్ చౌహాన్, కేపీఎల్ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు ఎండీ మతీన్, నరాల నరేశ్, ఏలంకి శ్రీకాంత్, సందీప్ ఆర్య, బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి తదితరులు పాల్గొన్నారు.

కరుణగిరిలో స్వస్థత ప్రార్థనలు ప్రారంభం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని నాయుడుపేట సమీపంలోని కరుణగిరిలో గురువారం పుణ్యక్షేత్ర మహోత్సవాల్లో భాగంగా స్వస్థత ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. రెవరెండ్ ఫాదర్ యుగల్ కుమార్ వాక్య పరిచయం చేశారు. సాయంత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన డీన్‌లు ప్రత్యేక ఉమ్మడి ప్రార్థన చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు బుర్రకథను ప్రదర్శించారు. శుక్రవారం వివిధ కార్యక్రమాలు ఉంటాయని కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ మాథ్స్యు వరప్రసాదరాజు తెలిపారు.

ఫాదర్ యుగల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరప్రసాదరాజు

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వైద్యులు, సిబ్బంది చూడాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. గురువారం స్థానిక మండల ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత ఉందని, దానికి అనుగుణంగా సిబ్బంది నియమించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్‌తో మాట్లాడి సిబ్బంది నియమించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందుప్రియాంక, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 29: సత్తుపల్లి మున్సిపాలిటీ ప్రజలకు వన్‌టైం స్కీం కింద ఇంటి పన్ను బకాయిల్లో 90శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఇంటి పన్ను బకాయి కలిగిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్‌డాం నిర్మాణానికి నిధులు మంజూరు

వైరారూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని స్నానాల లక్ష్మీపురం పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని వైరా నదిలో నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రూ.4.67కోట్లు నిధులు మంజూరు చేశారని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

'సాయిస్ఫూర్తి'లో ముగిసిన నాక్ కమిటీ పరిశీలన

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నాక్ కమిటీ పరిశీలన గురువారంతో ముగిసింది. మహారాష్ట్ర, అమరావతి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి షేరికర్ చైర్‌పర్సన్‌గా, మెంబర్లుగా కర్నాటక మంగుళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ మంజయ్య, అజిత్‌కుమార్ పాండా ఒరిస్సా యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌లు కళాశాలను పరిశీలించారు. కళాశాలలో అన్ని విభాగాల అధిపతుల సహకారంతో వసతులు, బాలురు, బాలికల వసతిగృహాలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీ, సెంట్రల్ లైబ్రరీని పరిశీలించారు.

భద్రమ్మ కుటుంబానికి సండ్ర పరామర్శ

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దారావత్ మంగయ్య మాతృమూర్తి దారావత్ భద్రమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం ఆమె నివాసానికి వెళ్లి భద్రమ్మ చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, షేక్ ఖాసీం, దుగ్గిరాల రవి, జానీ, భూక్యా ప్రసాద్, మహేశ్ ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

కారేపల్లి, ఫిబ్రవరి 29: కారేపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహాకుంభాభిషేకం, స్వామి వారి విగ్రహప్రతిష్ఠ, హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌కు బియ్యం, దుస్తుల వితరణ

పెనుబల్లి, ఫిబ్రవరి 29: లయన్స్‌క్లబ్ ఆఫ్ సప్తగిరి వీఎం బంజర ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు పోట్రు వెంకటేశ్వరరావు కుమార్తె రమ్య పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు బియ్యం, దుస్తులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

సత్తుపల్లి, ఫిబ్రవరి 29: స్థానిక డీసీసీబీలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పాలసీ తీసుకున్న మండలంలోని అయ్యగారిపేటకు చెందిన పలగాని బాలాజీరావు మృతిచెందారు. నామినీగా మృతుడి భార్య రాజ్యలక్ష్మికి రూ.2లక్షల చెక్కును గురువారం డీసీసీబీ డైరెక్టర్ చల్లగుళ్ల కృష్ణయ్య అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ రజిత, సూపర్‌వైజర్ రాకేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 29: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం పాత కమిటీని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని యూనియన్ జిల్లా ఇన్‌చార్జి బోయినపల్లి రామారావుగౌడ్ రాష్ట్ర సంఘాన్ని కోరారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎండీ హకీం తన ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినప్పటికీ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి డీ వేణుగోపాల్ తనకు తానుగా రాజీనామా చేసే విధంగా ఒత్తిడి చేశాడని తెలిపారు. జిల్లా సంఘం సభ్యులకు తెలియకుండా తనకు అనుకూలుడైన టీ పంతులును అదే పదవిలో నియమించారన్నారు. అదేమిటని ప్రశ్నించిన ప్రతీ కార్యవర్గ సభ్యులను తొలగిస్తూ వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తున్నాడని పేర్కొన్నారు. రాష్ట్ర సంఘం స్పందించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

కొణిజర్ల మాజీ సర్పంచ్‌పై దాడి

కొణిజర్ల, ఫిబ్రవరి 29: కొణిజర్ల తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావుపై గుర్తుతెలియని వ్యక్తులు మాస్క్‌లు, హ్యాండ్‌గ్లౌజులు ధరించి గురువారం తెల్లవారుజామున కత్తులతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడు రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున మూత్రవిసర్జన కోసం ఇంట్లో నుంచి బయటకు రాగా ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో రామారావు కేకలు వేయడంతో అప్పుడే ఓ వివాహ వేడుకకు వెళ్లి వస్తున్న పలువురు రామారావును గుర్తించి స్థానిక పోలీసులకు, చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి చేసిన వారు కొణిజర్లకు చెందిన ఓ ఇద్దరు వ్యక్తుల పేర్లు రామారావు పోలీసులకు తెలపడంతో వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైరా ఏసీపీ రెహామాన్, వైరా సీఐ సురేశ్, కొణిజర్ల ఎస్సై శంకర్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో 144 సెక్షన్ విధించి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

కొణిజర్లలో పోలీసుల పికెటింగ్

ప్రజలకు ఇబ్బందులు కలగనీయొద్దు

మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కల్లూరు, ఫిబ్రవరి 29: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజకు అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా ఎలాంటి సమస్య కలుగకుండా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురంలో తన నివాసంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పొంగులేటిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని, ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను ప్రభుత్వం అమలుచేస్తుందని, ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సత్తుపల్లి ఏసీపీ అనిశెట్టి రఘు, రూరల్ సీఐ వెంకటేశ్‌గౌడ్, తహసీల్దార్ సాంబశివుడు, ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, నాయకులు పసుమర్తి చందర్‌రావు, బొర్రా రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న సత్తుపల్లిలో గ్రీవెన్స్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 29 : జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 4న సత్తుపల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వేంసూరు రోడ్డులో లక్ష్మీప్రసన్న గార్డెన్స్‌లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఇంట్లో చోరీ

వైరాటౌన్, ఫిబ్రవరి 29: వైరాలోని లీలాసుందరయ్యనగర్, ఎన్‌వీఎస్ గార్డెన్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డ ఘటన చోటుచేసుకున్నది. లీలాసుందరయ్యనగర్ ఏరియాలో నివాసముంటున్న లచ్చునాయక్ ఇంట్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరబడి రూ.2 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనమూ..

మండలంలోని గండగలపాడు గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు పూర్ణకంటి దాసు వైరాలోని ఎన్‌వీఎస్ గార్డెన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఉంచి ఓ ఇంట్లో ప్రథమ చికిత్సలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారు. బాధితుడు వైరా పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

కారేపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన గుగులోత్ ప్రేమ్‌కుమార్, అతని భార్య బానోత్ శోభన ఇద్దరు కలిసి గేటు కారేపల్లి పోలంపల్లి గ్రామానికి చెందిన బానోత్ తులసీరాం అతని బంధువులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని వారి వద్ద నుంచి సుమారు రూ.1.87కోట్లు తీసుకున్నారు. వారికి ఉద్యోగ నియామకం కోసం నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు. నియామక పత్రం కింద ట్రెజరీలో టెక్నికల్ ప్రాబ్లం ఉందని మభ్యపెడుతున్నాడు. వీరికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వారిద్దరిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి ఒక స్కూటీ, 5 సెల్‌ఫోన్లు, లాప్‌టాప్, ఒక పెన్ డ్రైవ్‌తో పాటు కొన్ని నకిలీ డాక్యుమెంట్లను స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఖమ్మంలోని వండర్ కిడ్స్ పాఠశాల కరస్పాండెంట్ కొండపల్లి శశిధర్‌రెడ్డిను గురువారం హైదరాబాద్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఎన్నుకున్నారు.

యువకునికి గాయాలు

చింతకాని, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని తిరుమలాపురం అడ్డరోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి పడడంతో ఖమ్మం నగరానికి చెందిన వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు గురువారం ఉదయం బైక్‌పై బోనకల్లు నుంచి ఖమ్మం వైపు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గోతులను తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 ద్వారా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

ముదిగొండ, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం వద్ద గురువారం ఉదయం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ రోడ్డుపై నిత్యం ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుంటాయనీ, ఇసుక అక్రమ రవాణా చేసే క్రమంలో డ్రైవర్లు మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడుతుంటారని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు పటిష్ట చర్యలు తీసుకొని అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యా ప్రదాత గెంటేల నారాయణరావు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: వేలాది మంది విద్యార్థులకు జ్ఞానం, వెలుగులు నింపి విద్యా ప్రదాతగా చరిత్రలో నిలిచిన మహనీయుడు శ్రీరామ భక్త గెంటేల నారాయణరావు అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో స్థలదాత గెంటేల మనవరాలు కొలిపాక అన్నపూర్ణ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. 1956లో అప్పటి ప్రభుత్వానికి రూ.లక్ష కళాశాల కోసం విరాళమిచ్చిన విద్యా దార్శనికుడిగా కొనియాడారు.

ఖమ్మం వాసి స్వప్నకు డాక్టరేట్



ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: నగరంలోని రోటరీనగర్‌కు చెందిన గోరంట స్వప్నకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అర్థశాస్త్ర విభాగంలో తెలంగాణ రాష్ట్రంలో 'చిరు వ్యాపార మహిళల సమస్యలు అవకాశాలు-ఖమ్మం జిల్లాలో ఒక అధ్యయనం' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. స్వప్నను పలువురు అభినందించారు.